# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

ఆదివారం 05-07-2026

సంపుటి 1 సంచిక 222

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195




## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి

అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్తలు సూచించిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

4లో



## 'సిద్ధిపేటకా షేర్'..

**హరీశ్‌పై ప్రశంసలు కురిపించిన విజయ్ దేవరకొండ**

**సంజీవని చైల్డ్ హార్ట్ సెంటర్ సందర్శన.. చిన్నారులతో ముచ్చటించిన హీరో**

**దశ, సిద్ధిపేట:** సిద్ధిపేట జిల్లా కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ అండ్ రీసెర్చ్‌ను శనివారం మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ కలిసి సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులతో వారు కాసేపు సరదాగా గడిపి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన విజయ్ దేవరకొండ.. హరీశ్‌రావుపై ప్రశంసల వర్షం కురిపించారు. తనకు హరీశ్‌రావు

..మిగతా 4వ పేజీలో →





# పబ్బతి ఆంజనేయస్వామిని దర్శించుకున్న సీఎం

**రూ.10 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**దశ, నాగర్‌కర్నూల్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండపేటలోని శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఉరుకొండపేట గ్రామంలో సందడి నెలకొంది. రాజకీయ జీవితంలో జెడ్పీటీసీగా ఎన్నికైన సమయంలో ఈ గ్రామంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సుమారు 20 ఏళ్ల తర్వాత గ్రామంలో అడుగుపెట్టిన సీఎం రేవంత్ రెడ్డికి స్థానికులు, ఆత్మీయులు, అప్పటి సహచరులు ఘన స్వాగతం

..మిగతా 4వ పేజీలో →

**సీఎం రేవంత్ 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం..** 4లో

ముఖ్యమంత్రి రేవంత్ భావోద్వేగ ట్వీట్

'మిడ్జిల్‌లో రేవంత్‌గా.. మీ గుండెల్లో రేవంతన్నగా

## కవిత పార్టీకి ఈసీ షాక్!

**'తెలంగాణ రక్షణ సేన' పేరు మార్చాలని ఆదేశం**

**15 రోజుల్లో 3 ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని సూచన**




**దశ, హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్థాపించిన రాజకీయ పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీ) షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)' పేరును మార్చాలని సూచిస్తూ అధికారిక లేఖ పంపినట్లు సమాచారం. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేనిపక్షంలో పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేసే అవకాశం ఉందని ఈసీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. 'తెలంగాణ రక్షణ సేన' పేరులోని టీఆర్ఎస్ సంక్షిప్త నామం గతంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితితో పోలిక ఉండటంతో పాటు, ఓటర్లలో గందరగోళం తలెత్తే అవకాశం ఉందంటూ కొన్ని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బీఆర్ఎస్ సహా ఇతర వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ అభ్యంతరాల నేపథ్యంలోనే ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కవిత గతంలో ప్రకటించిన పార్టీకి ఎన్నికల సంఘం 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించినప్పటికీ, అనంతరం వచ్చిన అభ్యంతరాలపై విచారణ జరిపిన తర్వాత తాజా లేఖ జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈసీ సూచనల మేరకు పార్టీ కొత్త పేర్లను ప్రతిపాదించాల్సి ఉంది.



4లో

## తాగొద్దన్న భార్యను హతమార్చిన భర్త

**ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం.. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి**

# పొంచి ఉన్న సూపర్ ఎల్‌నినో

**ఆహార భద్రతకు ముప్పు?**

- వర్షపాతంపై ప్రభావం.. రైతులకు పెరుగుతున్న ఆందోళన
- 90 శాతం మాత్రమే వర్షపాతం?
- అస్థిర వాతావరణమే సవాల్
- ప్రభుత్వాలకు నిపుణుల సూచన




**దశ, హైదరాబాద్:** దేశంలో వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఈ ఏడాది తీవ్రస్థాయి సూపర్ ఎల్‌నినో ప్రభావం కనిపించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడి సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశముంది. దీంతో దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఏడాది రుతుపవనాల

..మిగతా 4వ పేజీలో →



## ట్రిబుల్ ఐటి (ఐఐఐటి)లో విద్యార్థి ఆత్మహత్య

**దశ, గచ్చిబౌలి:** ట్రిబుల్ ఐటిలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనిరుధ్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్య మరియు కుటుంబ సమస్యల వల్ల బాధపడుతున్నట్లు సమాచారం. తాను ఉంటున్న బిల్డింగ్ 6వ అంతస్తూ పై నుండి దూకి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి గా గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల

**1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లు జమ**

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదో విడత నిధులను విడుదల చేసింది. ఈ విడతలో ఆరు ఎకరాల వరకు సాగుభూమి కలిగిన 1.69 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.545.41 కోట్లను నేరుగా

..మిగతా 4వ పేజీలో →

## గచ్చిబౌలి-కొండాపూర్‌లో హైడ్రా ఉక్కుపాదం

**బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు భారీ ఎత్తున ఆక్రమణల తొలగింపు**



**దశ, హైదరాబాద్:** గచ్చిబౌలి-కొండాపూర్ ప్రధాన రహదారిపై అక్రమ ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా శనివారం తెల్లవారుజామున నుంచి భారీ ఎత్తున ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలు, షెడ్లు, వ్యాపార ఆక్రమణలు, ఇతర అనధికార నిర్మాణాలను జేసీబీలు, భారీ యంత్రాలతో కూల్చివేస్తున్నారు. ఉదయం

..మిగతా 4వ పేజీలో →

## భూ భారతిలో 98% దరఖాస్తులు తిరస్కరించారు గాదరి కిషోర్

**బడాబాబుల దరఖాస్తులకే ఆమోదం లభించిందని ఆరోపణ**

**దశ, హైదరాబాద్:** భూ భారతి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం తిరస్కరించారని, కేవలం 2 శాతం మాత్రమే ఆమోదించారని, అవి కూడా బడాబాబులకు చెందినవేనని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేశారు. శంషాబాద్‌లో కలెక్టర్ పనితీరు

..మిగతా 4వ పేజీలో →

# అర్హులు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి

## అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని కార్యకర్తలు సూచించిన మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

**దశ, ఇబ్రహీంపట్నం :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు) క్షేత్రస్థాయిలో ఒక సైనికుడిలా పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులను నూతన ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే బాధ్యతను పార్టీ కార్యకర్తలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న SIR ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు (BLOలు)తో సమన్వయం చేసుకుంటూ పార్టీ BLAలు, పార్టీ ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఇంటింటికీ వెళ్లి నూతన ఓటర్ల వివరాలు సేకరించడం, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ధ్రువీకరణ ప్రక్రియలో ప్రజలకు సహకరించడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, దోషరహితంగా రూపొందించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని పేర్కొన్న ఆయన, మరణించినవారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లు, డూప్లికేట్ నమోదులు వంటి అంశాలపై ఏవైనా లోపాలు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులతో పాటు పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఫారాలు నింపడంలో ప్రజలకు సహాయం చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ SIR ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పని చేయాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ) పిలుపునిచ్చారు.

# తాగొద్దన్న భార్యను హతమార్చిన భర్త

## ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం.. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల దర్యాప్తులో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలకృష్ణ తరచూ మద్యం సేవిస్తూ భార్య భార్గవి (35)తో గొడవపడేవాడు. గత నెల 20న మరోసారి మద్యం విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన బాలకృష్ణ భార్య గొంతు నులిమి, అనంతరం ఆమె తలను గోడకు బలంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత ఘటనను ఆత్మహత్యగా చూపించేందుకు భార్య మృతదేహాన్ని చీరతో ఫ్యాన్‌కు వేలాడదీసినట్లు వెల్లడించారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, సాంకేతిక ఆధారాలు మరియు విచారణలో లభించిన వివరాల ఆధారంగా నిందితుడిని ప్రశ్నించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో హత్య కేసుగా మార్చి బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# పొంచి ఉన్న సూపర్ ఎల్‌నినో

**మొదటి పేజీ తరువాయి**



వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతానికి మాత్రమే పరిమితం కావచ్చని ఐఎండీ ఇప్పటికే అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతుంది. భారతదేశంలో ఇది ప్రధానంగా రుతుపవనాల బలహీనతకు దారితీస్తుంది. ఫలితంగా అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, ఆలస్యంగా వచ్చే వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. ఇటీవల దేశవ్యాప్తంగా నమోదైన తీవ్ర వడగాల్పులు కూడా ఎల్‌నినో ప్రభావానికి సంకేతంగా వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నగరాల్లో భారత్‌కు చెందిన నగరాలే ఎక్కువగా ఉండడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. వాతావరణంలో ఏర్పడుతున్న ఈ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దేశంలోని దాదాపు 60 శాతం సాగుభూమి ఇప్పటికీ వర్షాధారంగానే ఉంది. పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల వంటి కీలక పంటలు వర్షాలపైనే ఆధారపడి సాగుతాయి. వర్షపాతం తగ్గితే పంట దిగుబడులు తగ్గడమే కాకుండా రైతుల ఆదాయం దెబ్బతింటుంది. అదే సమయంలో దేశ ఆహార భద్రత కూడా సవాల్‌గా మారే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా వాతావరణంలో ఏర్పడుతున్న అనిశ్చితి రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. ఒకవైపు స్వల్ప వ్యవధిలో భారీ వర్షాలు, మరోవైపు దీర్ఘకాలం వర్షాభావం, వడగాల్పులు సంప్రదాయ వ్యవసాయ విధానాలను పూర్తిగా మార్చేశాయి. గత కొన్నేళ్లలో జూన్ నెలలో అత్యధిక వర్షపాతం నమోదవుతుండగా, ఆగస్టు, అక్టోబర్ నెలల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కనిపించాయి. ఈ అస్థిర వాతావరణం కారణంగా రైతులు పంటల సాగులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట నష్టాలు పెరగడంతో అప్పుల భారం కూడా అధికమవుతోంది. ఒకవైపు వాతావరణ మార్పులు, మరోవైపు అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఇంధనం, ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్ల ధరలు పెరగడం రైతులకు మరింత భారంగా మారింది. గతంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడంతో కేంద్ర ప్రభుత్వం గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై తాత్కాలిక ఆంక్షలు విధించాల్సి వచ్చింది. ప్రస్తుతం కూడా వర్షపాతం తగ్గితే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయంగా కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల, ఎరువుల సరఫరాలో అంతరాయాలు కూడా వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశముంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు ముందస్తు కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాధార రైతులకు ప్రత్యేక సహాయం, నీటి నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పంట బీమా, వాతావరణ హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. సకాలంలో చర్యలు తీసుకోకపోతే సూపర్ ఎల్‌నినో ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే కాకుండా దేశ ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# మెట్రోపై మరోసారి కిషన్ రెడ్డికి సీఎం లేఖ

## రెండో దశ విస్తరణకు కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు వివరించినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ప్రాజెక్టుకు కేంద్ర ఆమోదం త్వరితగతిన లభించేలా ఒత్తిడి పెంచే దిశగా సీఎం చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు వ్యయాల అంచనాల కోసం గత సమావేశంలో ఎస్‌బీఐ క్యాప్స్‌కు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించగా, దీనిపై సంస్థ నుంచి తుది నివేదిక రావాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించినట్లు తెలిసింది. మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

# 48 గంటల్లో చోరీ కేసు ఛేదన

## రూ.7.70 లక్షలు స్వాధీనం.. కార్పెంటర్ అరెస్ట్

**దశ, హైదరాబాద్:** నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రూ.7.70 లక్షల నగదు చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లో ఛేదించారు. కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన మొత్తం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ ఎం. మట్టయ్య, హిమాయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం. సైదేశ్వర్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన దీపేష్ ఖతీ (19) ప్రస్తుతం సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అవంతి నగర్‌లో అమిత్ అగర్వాల్ ఇంట్లో పునరుద్ధరణ పనులు చేస్తున్న సమయంలో ఇంట్లో భద్రపరిచిన రూ.7.70 లక్షల నగదుపై కన్నేశాడు. జూన్ 30న ఇంటి యజమాని భార్య ఈవెనింగ్ వాక్‌కు వెళ్లేటప్పుడు బెడ్‌రూమ్‌కు తాళం వేయకపోవడాన్ని అవకాశంగా తీసుకున్న నిందితుడు చెక్క అల్మారాలో లేడీస్ పర్సుల్లో ఉంచిన నగదును అపహరించాడు. అనంతరం ఎలాంటి అనుమానం రాకుండా యథావిధిగా పనికి హాజరయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి, కార్మికులను విచారించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడి కదలికలపై అనుమానం రావడంతో విచారణ చేపట్టగా అతడు నేరాన్ని ఒప్పుకున్నాడు.



# హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్!

## అంతర్జాతీయ స్థాయి టూరిజం హబ్‌గా సాగర్ అభివృద్ధికి ప్రభుత్వ నిర్ణయం

## బుద్ధ విగ్రహాన్ని కొత్త కోణంలో వీక్షించేలా సర్క్యులర్ స్కైవాక్

## బుద్ధవనం-ఫణిగిరి-నేలకొండపల్లి-హైదరాబాద్‌ను కలుపుతూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌కు మరో ప్రతిష్ఠాత్మక పర్యాటక ఆకర్షణ అందుబాటులోకి రానుంది. నగర నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సరస్సు చుట్టూ ఆధునిక సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని ప్రణాళిక రూపొందించింది. ఈ స్కైవాక్ ద్వారా హుస్సేన్‌సాగర్ మధ్యలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిల బుద్ధ విగ్రహాన్ని సందర్శకులు సరికొత్త కోణంలో వీక్షించే అవకాశం కల్పించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న స్కైవాక్ సాయంత్ర వేళల్లో సరస్సు అందాలు, నగర వెలుగులు, బుద్ధ విగ్రహాన్ని ఒకే వేదికపై వీక్షించేలా రూపకల్పన చేయనున్నారు. దీంతో హైదరాబాద్ పర్యాటక రంగానికి కొత్త గుర్తింపు లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే సమయంలో నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ప్రపంచస్థాయి బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడ అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం, హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బుద్ధుడి జీవిత ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు, మహాస్థూపం తదితర ఆకర్షణలను మరింత విస్తరించనుంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భారీ మట్టి బౌద్ధ స్తూపం నిర్మాణానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం, ఫణిగిరి-బుద్ధవనం-నేలకొండపల్లి-హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని అనుసంధానిస్తూ ప్రత్యేక బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను రూపొందించనుంది. దేశీయ, విదేశీ బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా ఒక రోజు, రెండు రోజుల ప్రత్యేక టూరిజం ప్యాకేజీలను కూడా తీసుకురావాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టులు అమలైతే తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# పబ్బతి ఆంజనేయస్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్

**మొదటి పేజీ తరువాయి**

పలికారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీఎం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత సహచరులను అప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొందరు 20 ఏళ్ల క్రితం దిగిన ఫొటోలను చూపిస్తూ అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు మల్లు రవి, వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం..

## సీఎం రేవంత్ భావోద్వేగ ట్వీట్

### 'మిడ్జిల్‌లో రేవంత్‌గా.. మీ గుండెల్లో రేవంతన్నగా'



దశ, హైదరాబాద్: రాజకీయాల్లోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన, భావోద్వేగ ట్వీట్ చేశారు. ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం తన జీవితంలో మరపురాని అధ్యాయమని పేర్కొన్నారు. "లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలతో చెప్పినా తరగని మధుర జ్ఞాపకం ఈ 20 ఏళ్ల ప్రజా జీవితం. నాడు మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డిగా మొదలైన నా ప్రయాణం.. నేడు మీ అందరి గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే వరకు సాగింది" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ 20 ఏళ్లలో ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి పోరాటంలో తన వెంట నిలిచిన ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేస్తానని, తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా, అన్నింటికంటే "రేవంతన్న"గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# 'సిద్ధిపేటకా షేర్'..

**మొదటి పేజీ తరువాయి**

అంటే ఎంతో అభిమానమని పేర్కొంటూ, ఆయనను "సిద్ధిపేటకా షేర్" అని అభివర్ణించారు. తెలంగాణలో చిన్నారుల గుండె సంబంధిత వైద్య సేవల అవసరాన్ని గుర్తించి, ఆరోగ్య మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయించడంలో హరీశ్‌రావు కీలక పాత్ర పోషించారని విజయ్ గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా పేద చిన్నారుల గుండె చికిత్స కోసం హరీశ్‌రావు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని, ఇలాంటి నాయకులు ఒక తరం కోసం అరుదుగా ఉంటారని కొనియాడారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వైద్య సేవలను ప్రత్యక్షంగా చూడడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని విజయ్ దేవరకొండ తెలిపారు.

# ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల

**మొదటి పేజీ తరువాయి**

జమ చేసింది. ఈ తాజా విడతతో కలిపి ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. రైతులకు సాగు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన అర్హులైన రైతుల ఖాతాల్లో కూడా త్వరలోనే తదుపరి విడత రైతు భరోసా నిధులను జమ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.


# గచ్చిబౌలి–కొండాపూర్‌లో హైడ్రా ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి**

4 గంటల నుంచే ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు పర్యవేక్షణలో చర్యలు కొనసాగుతున్నాయి. ఈ చర్యల కారణంగా గచ్చిబౌలి-కొండాపూర్ మార్గంలో తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అధికారులు రహదారులను ఆక్రమణల రహితంగా మార్చి ట్రాఫిక్‌ను సులభతరం చేయడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# భూ భారతిలో 98% దరఖాస్తులు తిరస్కరించారు

**మొదటి పేజీ తరువాయి**



వివాదాస్పదంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆయనను మార్చలేదని, ఇందుకు వ్యక్తిగత సంబంధాలే కారణమని ఆరోపించారు. అలాగే, మంత్రులకు సమాచారం ఇవ్వకుండా వారి శాఖల్లో ముఖ్యమంత్రి నేరుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కేబినెట్ సమావేశానికి కొందరు మంత్రులు గైర్హాజరుకావడం, ప్రభుత్వంలో అంతర్గత విభేదాలకు సంకేతమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర పాలనలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సూచించారు. ముఖ్యమంత్రిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన గాదరి కిషోర్, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పాలన కొనసాగించాలని కోరారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com